ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 12-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- జార్ఖండ్ తొలి దశ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ రేపు జరగనుంది.
- భారతదేశాన్ని ప్రపంచానికి డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.
- జీవ ఇంధన మిశ్రమాన్ని వినియోగించడం వల్ల దేశానికి వేల కోట్ల రూపాయలు ఆదా అవుతాయని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి పేర్కొన్నారు.
- నౌకాదళ దినోత్సవాన్ని ఈ సంవత్సరం ఒడిశాలోని పూరిలో నిర్వహిస్తున్నామని విశాఖ తూర్పు నావికాదళం తెలిపింది.
- ఇంటర్ నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) 55వ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

=========================

జార్ఖండ్ లో తొలి దశ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ రేపు జరగనుంది. ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు ఎన్నికల అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తొలి దశలో రేపు 43 నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుంది. మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 15,344 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరగనుంది. వీటిలో 225 సున్నితమైన పోలింగ్ బూత్ లను గుర్తించారు. పశ్చిమ సింగ్భూమ్, లతేహార్, లోహర్దగా, గర్హ్వా, గుమ్లా 5 జిల్లాల్లోని ఈ పోలింగ్ బూత్‌లో ఉన్నాయి. ఎన్నికలు సజావుగా సాగేందుకు ఆయా ప్రాంతాల్లో రెండు వందల కంపెనీలకు పైగా భద్రతా బలగాలను మోహరించారు. రేపు జరిగే ఎన్నికల్లో 73 మంది మహిళలు సహా 683 మంది అభ్యర్థులు పోటీలో నిలిచాయి. కోటి 37 లక్షల మంది ఓటర్లు ఈ అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. రెండవ విడత పోలింగ్ ఈ నెల 20వ తేదీన 38 నియోజకవర్గాల్లో జరగనుంది. ఈ నెల 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

=========================

బీహార్ రాష్ట్రంలోని లోని ఇమామ్ గంజ్, బేలాగంజ్, తరారీ, రామ్ గఢ్ నియోవర్గాలకు సంబంధించి 4 అసెంబ్లీ స్థానాలకు రేపు పోలింగ్ జరగనుంది. 12 లక్షల మందికి పైగా ఓటర్లు ఐదుగురు మహిళా అభ్యర్థులతో సహా 38 మంది అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. గయ, భోజ్ పూర్, కైమూర్ జిల్లాల్లోని 1,277 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరగనుంది. మొత్తం 4 నియోజకవర్గాల్లో పోలింగ్ దృష్ట్యా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశాన్ని ప్రపంచానికి డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ రోజు ఢిల్లీ డిఫెన్స్ డైలాగ్‌లో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. దేశాన్ని డ్రోన్ హబ్ గా మార్చడం ద్వారా  భారత ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చన్నారు. ఈ కృషిలో మేక్ ఇన్ ఇండియా, స్వావలంబన గణనీయంగా దోహదపడతాయని తెలిపారు. భారత్ నుంచి పెరుగుతున్న రక్షణ వస్తువుల ఎగుమతి దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తోందని అన్నారు. భారతదేశం 100 దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తోందని ఆయన తెలిపారు. 2023-24లో భారత్ నుంచి రక్షణ ఎగుమతులను దిగుమతి చేసుకున్న దేశాల్లో మొదటి మూడు స్థానాల్లో అమెరికా, ఫ్రాన్స్, అర్మేనియా ఉన్నాయని కేంద్ర మంత్రి వెల్లడిస్తూ…

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జీవ ఇంధన  మిశ్రమాన్ని వినియోగించడం వల్ల దేశానికి 91 వేల కోట్ల రూపాయలు ఆదా అవుతాయని పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి పేర్కొన్నారు.  బెంగళూరులో ఈ రోజు 27వ ఎనర్జీ టెక్నాలజీ సదస్సుని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ… జీవ ఇంధన  మిశ్రమాన్ని వినియోగించడంలో భారత్ ప్రపంచంలోనే 2వ స్థానంలో ఉందని అన్నారు. వచ్చే సంవత్సరం నాటికి 20 శాతం జీవ ఇంధన  మిశ్రమాన్ని వినియోగించే లక్ష్యాన్ని చేరుకుంటుందన్నారు. దేశం ఈ రోజు హరిత శక్తి వైపుగా సాగుతోందని ఆయన గుర్తు చేశారు. కాగా, 2047 నాటికి భారతదేశ ఇంధన డిమాండ్ 2.5 రెట్లు పెరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో 2070 నాటికి సున్నా శాతం ఉద్గార లక్ష్యాన్ని సాధించడానికి ఇంధన భద్రత, సుస్థిరత, సాంకేతిక ఆవిష్కరణల్లో రెట్టింపు ప్రయత్నాలు అవసరమని  కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతీ సంవత్సరం డిసెంబర్ 4వ తేదీన విశాఖపట్నంలో జరిగే నౌకాదళ దినోత్సవం ఈ సంవత్సరం ఒడిశాలోని పూరిలో బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో నిర్వహిస్తున్నామని విశాఖ తూర్పు నావికాదళం తెలిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా భారత రాష్ట్రపతి,ద్రౌపది ముర్ము హాజరవుతున్నారు. ఈ సందర్భంగా నౌకాదళం తన బహుముఖ సామర్థ్యాలను ప్రదర్శిస్తుంది. ఈ కార్యక్రమం ద్వారా  పౌరుల్లో సముద్ర జలాల రక్షణపైన  అవగాహన ఏర్పడుతుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు భారత నావికాదళం ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక అధికారులతో కలిసి పని చేస్తోందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇంటర్ నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) 55వ  ఎడిషన్ ఉత్సవాలను ఈనెల 20 నుండి 28వ తేదీ వరకూ గోవాలో నిర్వహిస్తున్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. 81 దేశాల నుంచి 180 చలనచిత్రాలను ఈ ఉత్సవంలో పదర్శించనున్నారు. ప్రపంచ సినిమా వైభవాన్ని చాటే విధంగా ఈ వేడుకలు సాగుతాయని సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. భారతీయ సినిమా

తన పరిధిని ప్రపంచ స్థాయికి పెంచుకునే విధంగా ఈ ఉత్సవాల్లో పలు చిత్రాలు అలరించనున్నాయి. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిభించించే విధంగా ఈ ఉత్సవాలు సాగనున్నాయి. కన్నడ, హిందీ, తమిళం, తెలుగు, మరాఠీ, గుజరాత్, అస్సామీ, మళయాళం, బెంగాలీ తదితర భాషల నుంచి అద్భుతమైన చిత్రాలు ఈ ఉత్సవంలో ప్రదర్శిస్తారు. ఐఎఫ్ఎఫ్ఐ ఫిల్మ్ బజార్ ద్వారా నూతన ప్రతిభను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో సమాచార విప్లవానికి నాంది పలికింది ఆకాశవాణి. దశాబ్దాల క్రితం సమాచారాన్ని వేగవంతంగా చెరవేయడంలో ఆకశవాణి నిర్వహించిన పాత్ర ఎనలేనిది. ఈ నేపధ్యంలో ప్రజా ప్రసారాల సేవల దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. ఢిల్లీలోని ఆకాశవాణి భవన్ లో ఈ రోజు ప్రజా ప్రసార సేవల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా సాంస్కృతిక వైవిధ్యాన్ని తెలియజేయడంతో పాటు ప్రజలను విద్యావంతులు నూ ఆలోచనపరులను చేయడంలో ప్రోత్సహించడంలో ఆకాశవాణి కీలక పాత్ర పోషించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పప్పుధాన్యాల వాణిజ్యంలో భారత దేశంతో సహకారాన్ని పెంపొందించే చర్యలను రష్యా చేపట్టింది. రష్యా వ్యవసాయ మంత్రి మాక్సిమ్ టిటోవ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ రోజు దేశ వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరేతో ఢిల్లీలో సమావేశమైంది. పసుపు బఠానీ, కందిపప్పు వంటి పప్పుధాన్యాలను భారత్ కు అందించాలని రష్యా భావిస్తోంది. ఈ నేపధ్యంలో రెండు దేశాల మధ్య వాణిజ్య సహకారంపై చర్చలు జరిగాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 79,644 పాయింట్ల వద్ద ప్రారంభమై, చివరికి 78,675 వద్ద ముగిసింది. నిఫ్టీ 23,883 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.40కు చేరింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 72.29 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,599 డాలర్ల స్థాయిలో కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం ప్రతి సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటుంది. భారత దేశ రాజ్యాంగం 1950 జనవరి 26వ తేదీన అమలులోకి వచ్చింది. అయితే 1949 నవంబర్ 26న అధికారికంగా భారత రాజ్యాంగం ఆమోదించారు. అందుకే భారతదేశంలో నవంబర్ 26ని రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటారు. భారత రాజ్యాంగాన్ని హిందీ, ఇంగ్లీష్ భాషలలో రాశారు. రాజ్యాంగాన్ని రూపొందించడానికి మొత్తం 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజులు పట్టింది. భారత రాజ్యాంగం అసలు కాపీని పూర్తిగా చేతి రాతతో రాశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేరళ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, పశ్చిమ బెంగాల్ గవర్నర్ డాక్టర్ సీవీ ఆనంద్ బోస్ సమక్షంలో 'మా-మదర్' పుస్తకాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ రోజు ఢిల్లీలో ఆవిష్కరించారు. కేరళ గవర్నర్ అదనపు కార్యదర్శి డాక్టర్ దవేంద్ర కుమార్ ధోడావత్ ఈ పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకంలో హిందీ, ఇంగ్లీష్ భాషలలో రాసిన కవితలలో మాతృత్వానికి సంబంధించిన అనేక అంశాలు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =